మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి

# మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
ఆదివారం | 20 | సెప్టెంబర్ 2026 | పేజీలు : 12

# విశాఖలో పేదలకు పట్టాభిషేకం



2వ పేజీలో

- 28,445 కుటుంబాలకు ఇళ్ల పట్టాలతో లబ్ది
- రూ.8,874 కోట్ల విలువైన భూమిపై పేదలకు హక్కులు
- 399 ఎకరాలు క్రమబద్ధీకరించి పట్టాలు పంపిణీ చేసిన సీఎం
- రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావాన్ని అధిగమించేలా చర్యలు
- గత పాలనలో భయం... నేడు కూటమి హయాంలో భరోసా
- విశాఖలో పేదలకు పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** దశాబ్దాలుగా ఇళ్లపై హక్కుల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు కూటమి ప్రభుత్వం భరోసా కల్పించింది. పేదలకు పట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా విశాఖ జిల్లాలోని 28,445 కుటుంబాలకు ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్టాలు పంపిణీ చేశారు. విశాఖలోని 11 మండలాల్లో 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించడంతో పాటు మొత్తం 19,33,853 చదరపు గజాల స్థలాన్ని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కార్యక్రమంలో కొందరు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి స్వయంగా పట్టాలు అందజేశారు. రూ.8,874 కోట్ల విలువైన భూమిపై పేదలకు హక్కు కల్పిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు

## కలర్ ఫుల్ షర్ట్ లో అదిరి పోయావయ్యా..!!


3వ పేజీలో

- గంటా కు భుజం తట్టిన సిబిఎన్
- సరదా వ్యాఖ్యలతో ఆహ్లాదకర వాతావరణం

**ఆనందపురం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం కోసం శనివారం విశాఖపట్నం వచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమం సందర్భంగా గంటా ధరించిన రంగురంగుల చొక్కాను ప్రస్తావిస్తూ సీఎం సరదాగా వ్యాఖ్యానించడంతో అక్కడున్న నాయకుల మధ్య కొద్దిసేపు ఆహ్లాదకర వాతావరణం నెలకొంది. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం వేదిక వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి గంటా శ్రీనివాసరావు తదితర నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గంటాను పలకరించిన సీఎం.. ఆయన భుజం తడుతూ మాట్లాడారు. అనంతరం నాయకులతో కలిసి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో గంటా శ్రీనివాసరావు, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజులను ఉద్దేశించి సీఎం సరదాగా వ్యాఖ్యానించారు. సీనియర్ నాయకులిద్దరూ ప్రస్తుతం ఉత్సాహంగా, ఆరోగ్యంగా కనిపిస్తున్నారని సీఎం వ్యాఖ్యానించగా.. దీనికి గంటా స్పందిస్తూ విశాఖలో ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల

## ఇళ్ల పట్టాల పంపిణీ జిల్లా చరిత్రలో సువర్ణ అధ్యాయం : జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నం జిల్లాలో పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ చేపట్టిన ఇళ్ల పట్టాలు, కన్వేయన్స్ డీడుల పంపిణీ కార్యక్రమం జిల్లా చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. శనివారం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19,33,852.66 చదరపు గజాల విస్తీర్ణంలో సుమారు 400 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించి, మొత్తం 28,445 మంది లబ్ధిదారులకు రూ.8,874 కోట్ల విలువైన ఇళ్ల స్థల పట్టాలు, కన్వేయన్స్ డీడ్లు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలు 296, 388, 84, 30, 45 ప్రకారం జిల్లాలోని వివిధ నియోజకవర్గాల పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థల పట్టాలు, కన్వేయన్స్ డీడుల పంపిణీకి చర్యలు చేపట్టినట్లు


3వ పేజీలో

# విశాఖలో పేదలకు పట్టాభిషేకం







**ఒకటి తరువాయి**

పట్టాలను పంపిణీ చేశారు. పట్టాలు అందుకున్న కుటుంబాల్లో సంతోషం నెలకొంది. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. "పేదలకు పట్టాభిషేకం చేస్తున్నాం. వారి ఇళ్లపై సర్వహక్కులు కల్పిస్తున్నాం. ఇన్నాళ్లూ మీ ఇళ్లపై మీకు హక్కు లేదనే బాధ ఉండేది. దశాబ్దాల ఆందోళనకు ఇవాళ ముగింపు పలుకుతున్నాం. ఇక మీ ఇళ్లపై వివాదం లేదు.. భయం లేదు.. హక్కు మాత్రమే ఉంటుంది. కన్వేయన్స్ డీడ్స్ ఇస్తున్నామని, రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం ఈ భూముల విలువ రూ.8,874 కోట్లు ఉంటుంది. మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉంటుంది. భూమి విలువ పెరిగిందని అమ్ముకోవద్దు. ఈ భూమే మీకు భరోసా... ధైర్యం. 2024 ఎన్నికల్లో ప్రజలు వేసిన ఓటు వేలాది కుటుంబాలకు కూటమి ప్రభుత్వం ఆస్తి హక్కును కల్పించింది. ప్రజలు ఇచ్చిన అధికారంతో రాష్ట్ర పునర్నిర్మాణానికి ఒక్కో ఇటుకా పేరుస్తున్నాం. విధ్వంసం నుంచి వికాసం వైపు.. భయం నుంచి భరోసా వైపు.. నిరాశ నుంచి కొత్త ఆశల వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నాం ఇది పట్టాల పంపిణీ మాత్రమే కాదు.. పేదల ఆత్మగౌరవానికి పట్టాభిషేకం. హక్కులకు, పిల్లల భవిష్యత్తుకు పట్టాభిషేకం." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

### పంచగ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం

"కూడు, గూడు, గుడ్డ.. ఇదే మా ప్రభుత్వ నినాదం. ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు ఉండాలనే ఎన్టీఆర్ స్ఫూర్తితో పనిచేస్తున్నాం. ఇంటి జాగా ఇస్తాం.. ఇల్లు కట్టిస్తాం.. ప్రతి కుటుంబానికి శాశ్వత చిరునామా కల్పిస్తాం. రెండేళ్లలో 5 లక్షలకు పైగా ఇళ్లు నిర్మించాం. వచ్చే మార్చిలోగా మరో 5 లక్షలకు పైగా ఇళ్లు అందిస్తాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన కూటమి ప్రభుత్వ విధానం. విశాఖలోని పంచగ్రామాల సమస్యకు కూడా త్వరలోనే పరిష్కారం చూపిస్తాం. ఇంకా 22 వేల మందికి పట్టాలు ఇవ్వాల్సి ఉంది.. వారందరికీ త్వరలో పట్టాలు అందించేలా చర్యలు తీసుకుంటాం. మీ భూమి--మీ హక్కు' కార్యక్రమం ద్వారా రెవెన్యూ సమస్యల నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తున్నాం. వివిధ జిల్లాల్లో ఇప్పటికే 12 వేల కుటుంబాలకు భూములను క్రమబద్ధీకరించి పట్టాలు ఇచ్చాం.

### కాబోయే విశ్వనగరం విశాఖ

విశాఖ దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఒకటని ముఖ్యమంత్రి అన్నారు. అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు తొడిగామని చెప్పారు. విశాఖ కాబోయే విశ్వనగరమని, అభివృద్ధి ఫలాల్లో పేదలకూ భాగస్వామ్యం ఉండేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. విశాఖను పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 145 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వ్యర్థాలను తొలగించామని తెలిపారు. తిరుమలలో 89.4 శాతం పచ్చదనం ఉన్నట్లే విశాఖలోనూ పచ్చదనాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. విశాఖ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని సీఎం చంద్రబాబు చెప్పారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడేందుకు కేంద్రం సహకరించిందని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. విశాఖ అభివృద్ధి ఇక ఆగదని స్పష్టం చేశారు.

### రాష్ట్రంపై ఎల్ నినో ప్రభావం తీవ్రం

ఎల్‌నినో ప్రభావంతో విశాఖలో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని చంద్రబాబు తెలిపారు. విశాఖకు వచ్చిన వెంటనే తాగునీటి పరిస్థితిపై సమీక్షించానని, సమస్యను అధిగమించేలా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పోలవరం ద్వారా గోదావరి జలాలను విశాఖకు తీసుకొచ్చి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని తెలిపారు. నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రంలో నీటి కొరత లేకుండా చూస్తామని చెప్పారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా అనకాపల్లికి గోదావరి జలాలు తీసుకొచ్చామని, వాటిని వంశధారకు అనుసంధానించే చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి మార్కాపురానికి నీరందిస్తున్నామని తెలిపారు.

### విధ్వంసం నుంచి వికాసం వైపు

గత ప్రభుత్వ హయాంలో విశాఖలో భూ వివాదాలు, కూల్చివేతలు, ఇతర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని ముఖ్యమంత్రి విమర్శించారు. గత పాలకులు భూ కబ్జాలకు పాల్పడితే.. నేడు కూటమి ప్రభుత్వం పేదలకు పట్టాలు పంపిణీ చేస్తోందన్నారు. రుషికొండలో నిర్మించిన భవనాల నిర్వహణపై త్వరలో నిర్ణయం తీసుకుని ప్రజలకు ప్రయోజనం కలిగేలా చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం పరిశ్రమలను తీసుకొస్తుంటే అడ్డంకులు సృష్టిస్తున్నారని, డేటా సెంటర్ల విషయంలోనూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని చంద్రబాబు విమర్శించారు. విశాఖ ప్రజలకు తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీరు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, నారాయణ, అచ్చెన్నాయుడు, బాలవీరాంజనేయ స్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ భరత్ పాల్గొన్నారు.










# సస కార్యక్రమంలో బంధవీధి సందర్శించిన జిల్లా కలెక్టర్

## గ్రామస్థులతో మమేకమై సమస్యలను తెలుసుకున్న కలెక్టర్ నిశాంతి టి



**పాడేరు , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, శనివారం బంధవీధి గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చేరుకున్న కలెక్టర్‌కు గ్రామస్థులు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పశువైద్యశాల వద్ద స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, స్వచ్ఛత ప్రాధాన్యతపై గ్రామస్థులకు కలెక్టర్ అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామస్థులతో మమేకమై సమస్యలపై ఆరాఅనంతరం కలెక్టర్ గ్రామంలోని దిగువ బంధవీధి ప్రాంతంలో ఒక ఇంటి అరుగుపై గ్రామస్థులతో కూర్చొని వారితో ఆత్మీయంగా మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు, ప్రజల యోగక్షేమాలు, వారికి అందుతున్న ప్రభుత్వ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి సమస్యకు గల కారణాలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి రూ. 16 లక్షల నిధులుఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీ నాగభూషణం గ్రామంలో తాగునీటి సమస్యకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఎన్ హెచ్-51 పనుల్లో భాగంగా మూడు హ్యాండ్‌పంపులు, ఒక వాటర్ ట్యాంక్, ఒక బావి తొలగించడంతో గ్రామంలో తాగునీటి సమస్య ఏర్పడినట్లు తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు సమస్య పరిష్కారానికి ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు లేఖ రాసి రూ. 16 లక్షల నిధులు మంజూరు చేయించుకున్నట్లు ఏఈ శ్రీ నాగభూషణం తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని వివరించారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయడంతో పాటు స్థానికంగా టెండర్లు నిర్వహించి పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఆదేశాలు గ్రామస్థులు గ్రామంలో డ్రైనేజీ సమస్య కూడా ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సమస్యను పరిశీలించిన కలెక్టర్ మ్యాజిక్ డ్రెయిన్స్ పథకం ద్వారా డ్రైనేజీ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో, అక్కడికక్కడే సంబంధిత అధికారులను ఆదేశించి పరిష్కారానికి చర్యలు చేపట్టడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పరిశుభ్రత, తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల మెరుగుదలకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

# పాండ్రంగిలో ఘనంగా అన్నదానం..!!

**పద్మనాభం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** శ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం పాండ్రంగి గ్రామంలో మత్స్యకార సహకార సంఘం కులవాసుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక స్వామి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తుండగా.. ఈ ఏడాది భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. వినాయక స్వామిని దర్శించుకునేందుకు పాండ్రంగి గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని మత్స్యకార సహకార సంఘం కులవాసులు అన్నదానానికి విస్తృత ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆహారం వడ్డించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ.. వినాయక మహోత్సవాల్లో భాగంగా అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భక్తులకు ఆహారం అందించడంతో పాటు సేవా భావాన్ని చాటుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రతి ఏడాది కంటే ఈసారి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో అన్నదాన కార్యక్రమం మరింత ఘనంగా సాగిందని నిర్వాహకులు తెలిపారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, మత్స్యకార సహకార సంఘం కులవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఎంపీటీసీ మరియు జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల తుది జాబితా ప్రచుర



**గొలుగొండ , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఈ రోజు 2026 స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎంపీటీసీ మరియు జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ స్టేషన్ల తుది జాబితాను ప్రచురించడం జరిగింది. ఈ తుది జాబితాను మండల పరిషత్ కార్యాల యం, తహసీల్దార్ కార్యాలయం మరియు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రజల పరిశీలనార్థం ప్రదర్శించడం జరుగుతోంది కాబట్టి ప్రజలు, రాజకీయ పార్టీలు మరియు సంబంధిత అభ్యర్థులు పోలింగ్ స్టేషన్ల వివరాలను ఆయా కార్యాలయాలలో పరిశీలించవచ్చని తెలియజేయడమైనది. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తోటి సిబ్బంది ఫాల్గున్నారు.

# కలర్ ఫుల్ షర్ట్ లో అదిరి పోయావయ్యా..!!

**ఒకటి తరువాయి**

కారణంగా నీటి సమస్యపై ఆందోళన ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య జరిగిన సంభాషణ అక్కడున్న నాయకుల్లో ఆసక్తి కలిగించింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. విశాఖ జిల్లాలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని ఏళ్లుగా నివసిస్తున్న కుటుంబాలకు హక్కులు కల్పించే కార్యక్రమంలో భాగంగా పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులు కూడా పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వారిని పలకరించారు. విశాఖలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న కుటుంబాలకు వాటిపై హక్కులు కల్పించే చర్యల్లో భాగంగా పట్టాల పంపిణీ చేపట్టారు. జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం కలిగింది. ఇళ్ల పట్టాల పంపిణీ సందర్భంగా భీమిలి నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులతో సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. వారి సమస్యలు, పట్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కూడా లబ్ధిదారులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాల పంపిణీ జిల్లా చరిత్రలో సువర్ణ అధ్యాయం : జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

**ఒకటి తరువాయి**

వెల్లడించారు. విశాఖపట్నం ఈస్ట్‌లో 6,555, వెస్ట్‌లో 5,093, నార్త్‌లో 2,601, పెందుర్తిలో 2,851, గాజువాకలో 6,134, భీమిలిలో 5,211 మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతున్నట్లు తెలిపారు. రెగ్యులరైజేషన్ స్కీమ్-2025 కింద జీవో 30 ద్వారా 11,783 దరఖాస్తులను స్వీకరించి, క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం అర్హత సాధించిన లబ్ధిదారులకు పట్టాల పంపిణీ చేపడుతున్నట్లు గుర్తు చేశారు. అదేవిధంగా జీవో 45 కింద గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలో 943 దరఖాస్తులకు ఆమోదం లభించినట్లు చెప్పారు. పట్టా కేవలం ఒక కాగితం కాదని, అది ఒక కుటుంబానికి భరోసా, ఇంటిపై హక్కు, భవిష్యత్‌పై నమ్మకమని కలెక్టర్ పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అండగా నిలుస్తోందని తెలిపారు. సొంతింటి కలను నిజం చేసే దిశగా పట్టాల పంపిణీ ఒక కీలక ముందడుగని అన్నారు.

### గ్లోబల్ సిటీగా విశాఖకు తోడ్పాటు...

విశాఖపట్నం అభివృద్ధిలో పరిశ్రమలు, ఐటీ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఇప్పటికే 31 ఐటీ సంస్థలకు భూములు కేటాయించగా, రూ. 1.40 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు, 1.36 లక్షలకు పైగా ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. డేటా సెంటర్లు, ఎంఎస్ఎంఈలతో పాటు ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. విశాఖను గ్లోబల్ సిటీగా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ విభాగాలు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గత ఏడాది నిర్వహించిన పార్టనర్‌షిప్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించిన స్ఫూర్తితో, ఈ ఏడాది కూడా సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# ఎండిపోతున్న ముడసర్లోవ రిజర్వాయర్..!!

## విశాఖకు తాగునీటి ముప్పు

**ఆనందపురం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** ఒకప్పుడు నిండుకుండలా కనిపించిన ముడసర్లోవ రిజర్వాయర్ ఇప్పుడు ఎండిపోయిన నేలగా దర్శనమిస్తోంది. వర్షాభావ పరిస్థితులతో నీటిమట్టం గణనీయంగా పడిపోవడంతో జలాశయం అడుగు భాగం బయటపడుతోంది. పలుచోట్ల బీటలు వారిన నేల, బయటకు కనిపిస్తున్న భారీ బండరాళ్లు రిజర్వాయర్‌లో నీటి నిల్వలు ఏ స్థాయికి పడిపోయాయో కళ్లకు కడుతున్నాయి. ఆగస్టు చివరి వారంలోనే ముడసర్లోవ పరిస్థితిపై ఆందోళన వ్యక్తమైనప్పటికీ.. ప్రస్తుతం విశాఖ నగరంలో తాగునీటి ఎద్దడి మరింత తీవ్రరూపం దాల్చడంతో ఈ జలాశయం పరిస్థితి మరోసారి చర్చనీయాంశంగా మారింది.

**అడుగంటిన జలాశయం.. పెరుగుతున్న ఆందోళన**

విశాఖ నగర తాగునీటి అవసరాలు తీర్చడంలో ముడసర్లోవ కీలకమైన జలాశయాల్లో ఒకటి. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో ముడసర్లోవతో పాటు మేహాద్రిగెడ్డ తదితర రిజర్వాయర్లలో నీటిమట్టాలు గణనీయంగా తగ్గాయి.



భూగర్భ జలాలు కూడా పడిపోవడంతో పలు ప్రాంతాల్లో బోర్లు సైతం ఎండిపోతున్నాయి. దీంతో నగరవాసులు ప్రధానంగా కొళాయి నీటిపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం నగరంలో కొన్ని ప్రాంతాలకు రెండు, మూడు రోజులకు ఒకసారి మాత్రమే కొళాయి నీరు వస్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో రోజువారీ సరఫరా ఉన్నా పరిమిత సమయానికే నీరు వస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ట్యాంకర్లకు డిమాండ్ పెరగడం, వాటి సరఫరా కూడా తగ్గడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**వర్షాలపైనే ఆశలు**

ముడసర్లోవ రిజర్వాయర్ పరిస్థితిని చూస్తుంటే నగర భవిష్యత్తు తాగునీటి అవసరాలపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు నగర జనాభా, అవసరాలు పెరుగుతుండగా.. మరోవైపు స్థానిక జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది. ప్రత్యామ్నాయ నీటి వనరులపై ఆధారపడుతున్నప్పటికీ.. వర్షాలు సమృద్ధిగా కురిసి జలాశయాలు నిండితేనే పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలను విశాఖకు తీసుకురావడంపై అధికారులు దృష్టి సారించారు. ఏలేరు కాలువ పూడికతీత పనులను పూర్తి చేసి గోదావరి జలాలను నగరానికి అందించాలని ముఖ్యమంత్రి కార్యాలయం ఆదేశించినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

## విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి



**గొలుగొండ , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** గొలుగొండ మండలం హుకుంపేట గ్రామంలో శనివారం ఉదయం సుమారు 10:30 గంటలకు విద్యుత్ షాక్‌కు గురై ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈయన నాతవరం మండలం వెంకయ్యపాలెం గ్రామానికి చెందిన వేములూరి శంకరాచారి కార్పెంటర్‌గా పని చేసేందుకు హుకుంపేట గ్రామానికి వచ్చాడు. కార్పెంట్రీ పనిలో భాగంగా ఉపయోగిస్తున్న యంత్రంలో ఏర్పడిన సమస్యను సరిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే గోలుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శంకరాచారి మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య వేములూరి దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోలుగొండ పోలీస్ స్టేషన్‌లో Cr.No.74/2026 U/s 194 BNSS (174 Cr.P.C.) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## అన్నవరం వాగు బ్రిడ్జి వద్ద ముందస్తు చర్యలు చేపట్టిన వీఆర్ పురం ఎస్ఐ సాదిక్



**వీఆర్ పురం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** మండలంలోని అన్నవరం వాగు బ్రిడ్జి వద్ద రాత్రి సమయంలో ఎటువంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా వీఆర్ పురం ఎస్ఐ సాదిక్ గారి ఆధ్వర్యంలో రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. రాత్రి వేళలో బ్రిడ్జి సరిగా కనిపించక వాహనదారులు ఇబ్బంది పడే అవకాశం ఉందని గుర్తించి, ప్రమాదాలను ముందే నివారించేందుకు ఈ చర్య చేపట్టినట్లు ఎస్ఐ సాదిక్ తెలిపారు. రేడియం స్టిక్కర్ల ఏర్పాటు వల్ల రాత్రి సమయంలో దూరం నుంచే బ్రిడ్జి స్పష్టంగా కనిపించి వాహనదారులు అప్రమత్తంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు రాత్రి వేళ నెమ్మదిగా, జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని వీఆర్ పురం మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


## లొడగలవానిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

**ఆనందపురం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** మండలంలోని లొడగలవానిపాలెంలో ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం 'సేవా సంకల్ప ప్రచారం' కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ నాయకులు లొడగల రమణ, బమ్మిడి శ్రీతారక్, లొడగల వెంకటరావు, లొడగల సురేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిబిరానికి 66 మంది హాజరు కాగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన వైద్య సేవలు అందించారు. వైద్యాధికారి డాక్టర్



ఎస్.కె. షాబీనా బాను మాట్లాడుతూ అధిక రక్తపోటు, మధుమేహం, ఊపిరితిత్తులు, క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణకు క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. ఆహారంలో ఉప్పు, పంచదార వినియోగాన్ని తగ్గించాలని తెలిపారు. స్థూలకాయం, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు 'టెలి మానస్' ఉచిత హెల్ప్‌లైన్ 14416 ద్వారా నిపుణుల సలహాలు పొందవచ్చని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించి పౌష్టికాహారం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పి.వి. రత్నం, ఉపాధ్యాయురాలు ఎం. సుగుణ, హెల్త్ విజిటర్ పి. రోహిణి, సిహెచ్‌ఓ జి. శ్రీనివాసరావు, ఏఎన్‌ఎం గౌరి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

## విశాఖలోని ప్రైవేట్ పాఠశాలలో విషాద ఘటన..!



### 9వ తరగతి బాలికకు తీవ్ర గాయాలు.ఆస్పత్రికి తరలింపు..!

**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** విశాఖ మధురవాడలోని శ్రీ గాయత్రీ విద్యానిలయంలో 9వ తరగతి చదువుతున్న బాలికకు తీవ్ర గాయాలయ్యాయి.స్కూల్‌లో ఉండగా బాలిక మెట్లపై నుంచి పడిపోయినట్లు సిబ్బంది చెబుతున్నారు.ఈ ఘటనలో బాలికకు గాయాలు కావడంతో.. స్కూల్ సిబ్బంది వెంటనే ఆమెను ఆస్పత్రికి తరలించారు.ప్రస్తుతం బాలికకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అసలు బాలిక ఎలా కిందపడింది..? ప్రమాదం ఎలా జరిగింది..? అన్నది తెలియాల్సి ఉంది.

## కొత్త సారథి అనూషను కలవనున్న వైసీపీ శ్రేణులు



**ఆనందపురం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** భీమిలి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా బొత్స అనూష నియమితులైన నేపథ్యంలో ఆనందపురం మండలానికి చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం విజయనగరంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలవనున్నారు.

వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బొత్స అనూషను సమన్వయకర్తగా నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆనందపురం మండలానికి చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ఆదివారం సాయంత్రం 4 గంటలకు విజయనగరంలోని బొత్స అనూష స్వగృహానికి చేరుకుని ఆమెను మర్యాదపూర్వకంగా కలవనున్నారు. మండలంలోని పార్టీ శ్రేణులు కార్యక్రమానికి హాజరుకావాలని ఆనందపురం మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యం కోరారు.

# అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా 'ఆపరేషన్ వజ్రప్రహార్'

## నేర నియంత్రణే లక్ష్యంగా భారీ కార్డన్ & సెర్చ్ ఆపరేషన్

**అనకాపల్లి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నేరాల కట్టడి, మాదకద్రవ్యాల నిర్మూలన మరియు అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా ఉంచడమే ధ్యేయంగా ఈరోజు వేకువజామున 05:00 గంటల నుండి అనకాపల్లి మరియు నర్సీపట్నం సబ్ డివిజన్ల పరిధిలో పోలీసులు విస్తృతంగా 'ఆపరేషన్ వజ్రప్రహార్' (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు.

**కసింకోట పోలీస్ స్టేషన్ పరిధిలో:**

అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో కసింకోట సిఐ స్వామినాయుడు, అనకాపల్లి టౌన్, రూరల్, ట్రాఫిక్ సిఐలు వెంకటనారాయణ, ప్రేమ కుమార్, అశోక్ కుమార్, ఈగల్ టీమ్ ఇన్స్పెక్టర్ నారాయణరావు మరియు సుమారు 70 మంది పోలీస్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 37 ద్విచక్ర వాహనాలు మరియు 6 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నర్సీపట్నం టౌన్ (ఎస్సీ కాలనీ) పరిధిలో: నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీ పోతిరెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నర్సీపట్నం టౌన్ మరియు రూరల్ సిఐలు గఫూర్, రేవతమ్మ,





ఎస్ఐలు, ఈగల్ టీమ్ సిబ్బంది మరియు ప్రత్యేకంగా నార్కోటిక్ డాగ్ 'బన్నీ'తో కలిసి సుమారు 50 మంది పోలీసు బలగాలు ఎస్సీ కాలనీలో విస్తృత తనిఖీలు నిర్వహించాయి. 230 ఇళ్లలో సమగ్ర తనిఖీలు చేపట్టి, దాదాపు 440 మంది వ్యక్తుల వివరాలను సేకరించారు. నార్కోటిక్ స్నిఫర్ డాగ్ "బన్నీ" సహాయంతో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిల్వలు, రవాణా మరియు వినియోగంపై అనుమానిత ప్రాంతాలు, ఇళ్లు మరియు వాహనాలలో విస్తృతంగా సోదాలు జరిపారు. డ్రగ్స్ అలవాటున్నట్లు అనుమానిస్తున్న 8 మంది ఇళ్లు, పాత చీటింగ్ కేసులో నిందితుడైన ఒకరి ఇల్లు, అలాగే 5 మంది రౌడీ/సస్పెక్ట్ షీటర్ల నివాసాలను పరిశీలించి వారి ప్రస్తుత కదలికలను ఆరా తీశారు. కాలనీలోని 31 మోటార్ సైకిళ్లు, ఒక ఆటోను క్షుణ్ణంగా తనిఖీ చేసి వాటి వివరాలను నమోదు చేసుకున్నారు. పోలీస్ అధికారుల హెచ్చరిక: ఈ సందర్భంగా సబ్ డివిజన్ పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. సమాజ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులు, గంజాయి/డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. గ్రామాలు, కాలనీల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా అక్రమ కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అవంతి కళాశాలలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

**తగరపువలస , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు శనివారం కళాశాల ఆవరణలో స్వర్ణ ఆంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టి, విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బందికి పరిశుభ్రత, పరిసరాల పరిరక్షణపై అవగాహన కల్పించారు. పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను తమ బాధ్యతగా భావించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. మురళీకృష్ణ, డైరెక్టర్ డా. ఎ. చంద్రశేఖర్, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హెచ్. షరీఫ్, జె.ఆర్.జి. పట్నాయక్, గోండు చిన్నయ్య,





అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పాల్తేరులో రైతులకు యూరియా పంపిణీ పిఎసిఎస్ చైర్మన్ దేవవరపు రాజుబాబు



**పాయకరావుపేట , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** మండలంలోని పాల్తేరులో శనివారం పాయకరావుపేట పిఏసిఎస్ చైర్మన్ దేవవరపు రాజుబాబు రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజుబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా జిల్లాలోని రైతాంగానికి సాగునీరు అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కిందని తెలిపారు. ప్రభుత్వం అందజేసిన యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాజుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్తేరు తెలుగుదేశం పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొంకిపూడి రమేష్, ఎంపీటీసీ మాకినీడి చిట్టిబాబు, కడింపల్లి కన్నారావు, మాకినీడి సత్తిబాబు, రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమెరికన్ ఫుల్ బ్రైట్ స్కాలర్ కు గీతం ఆతిధ్యం



**భీమునిపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** ప్రపంచ విద్యారంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఫుల్ బ్రైట్ స్కాలర్ షిప్ అధ్యయనానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా మారనుంది. యూఎస్ గవర్నమెంట్ స్పాన్సర్ చేసే ఫుల్‌బ్రైట్ స్కాలర్‌షిప్ ప్రపంచంలోనే ప్రథమ స్థానంలో గల ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్, కల్చరల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్. సాధారణంగా దేశంలోని పరిశోధకులు ఈ స్కాలర్ షిప్ ద్వారా అమెరికా సహా ఇతర దేశాలలో పరిశోధనలకు ఆసక్తి చూపుతారు. ఐతే మట్టదటిసారి అమెరికాలోని జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్శిటీ నుంచి ఫుల్‌బ్రైట్ స్కాలర్ కె. నీరజ్ భారతదేశంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని ఎంపికచేసుకున్నాడు. ఇంతకు ముందు గీతం నుంచి ప్రొఫెసర్ నళిని బిక్కిన (2017–18 ఫుల్‌బ్రైట్ ఫెలో, క్లైమేట్ చేంజ్ అడాప్టేషన్ అవార్డు గ్రహీత) ఫెలోగా వెళ్లగా, ఇప్పుడు తొలిసారిగా వేరే దేశం నుంచి స్కాలర్‌కు గీతం ఆతిథ్యం ఇస్తోంది. విశాఖపట్నంలోని గీతంలో ప్రొఫెసర్ బిక్కిన పర్యవేక్షణలో నీరజ్ పనిచేయనున్నాడు. పబ్లిక్ హెల్త్ గ్రాడ్యుయేట్ అయిన నీరజ్ విశాఖలో ఆల్కహాల్ వాడకంతో వచ్చే సామాజిక కళంకం (స్టిగ్మా )పై క్వాంటిటేటివ్, క్వాలిటేటివ్ పద్ధతుల్లో పరిశోధన చేయనున్నాడు. లోకల్ బిహేవియరల్ హెల్త్ సర్వీసెస్‌ను మెరుగు పరచడానికి, భవిష్యత్ హెల్త్ పాలసీలకు పనికొచ్చే ఆధారపూర్వక వ్యూహాలను రూపొందించడం ఈ స్టడీ లక్ష్యం అని నీరజ్ కు మార్గదర్శకం వహించనున్న గీతం ప్రొఫెసర్ బి.నళిని వెల్లడించారు. లోకల్ పబ్లిక్ హెల్త్ ఇష్యూలను గ్లోబల్ ఎపిడెమియాలజికల్ ఫ్రేమ్‌వర్క్‌తో అనుసంధానించడానికి, రీజినల్ యూనివర్సిటీలను గ్లోబల్ అకడమిక్ డిప్లమసీలో యాక్టివ్ నోడ్స్‌గా మార్చడానికి ఇది ఉపయోగపడు తుందని ఆమె పేర్కొన్నారు.

# జడ్పీ లకు ప్రత్యేక అధికారులుగా కలెక్టర్లు

**ఆనందపురం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** రాష్ట్రంలోని జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీ) చైర్మన్, వైస్‌చైర్మన్, సభ్యుల పదవీకాలం ఈ నెల 24తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా మేజిస్ట్రేట్లను జిల్లా పరిషత్‌ల కు ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుత జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం ముగిసిన అనంతరం పరిపాలన వ్యవహారాలను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించనున్నారు. ఆయా జిల్లాల్లో జిల్లా పరిషత్‌కు సంబంధించిన పరిపాలనా బాధ్యతలను కలెక్టర్లు నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రభుత్వం చేపట్టే తదుపరి చర్యలకు అనుగుణంగా జిల్లా స్థాయిలో అవసరమైన పరిపాలనా వ్యవహారాలను వారు పర్యవేక్షించనున్నారు.

# జీకేవీధి కేజీబీవీలో బాల్య వివాహాల నిరోధంపై అవగాహన

## పోక్సో చట్టం, 1098 బాలల సహాయవాణిపై విద్యార్థినులకు అవగాహన



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** మండలంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం, బాలల సహాయవాణి ఆధ్వర్యంలో శనివారం బాల్య వివాహాల నిరోధం, పిల్లలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం, 1098 బాలల సహాయవాణిపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలు ఎదుర్కొనే రక్షణ సమస్యలు, చట్టపరమైన హక్కులు, ఆపద సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై వారికి వివరంగా అవగాహన కల్పించారు. కార్యక్రమానికి జిల్లా బాలల సంరక్షణ విభాగం రక్షణ అధికారులు కమిడీ రాజశేఖర్, న్యాయ సహాయ అధికారి అశోక్‌కుమార్, సామాజిక కార్యకర్త శాంతి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాలికలకు చిన్న వయస్సులో వివాహం చేయడం వల్ల వారి విద్యాభ్యాసం దెబ్బతినడంతో పాటు శారీరక, మానసిక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. బాలికల భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులు, దుర్వినియోగం వంటి ఘటనలను అరికట్టేందుకు పోక్సో చట్టం కల్పిస్తున్న రక్షణ గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో లేదా బయట తమకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే భయపడకుండా విశ్వసనీయమైన పెద్దలకు తెలియజేయాలని సూచించారు. తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతర బాలికల భద్రత విషయంలో కూడా బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. పిల్లలు ఆపదలో ఉన్నప్పుడు లేదా ఎక్కడైనా బాల్య వివాహం జరుగుతున్నట్లు సమాచారం తెలిసినప్పుడు వెంటనే 1098 బాలల సహాయవాణికి సమాచారం అందించాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోరేందుకు ఈ సేవను వినియోగించుకోవచ్చని తెలిపారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. బాలల రక్షణకు సంబంధించిన అంశాలపై ఎలాంటి భయం లేకుండా సంబంధిత అధికారులను సంప్రదించాలని విద్యార్థినులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సహాయవాణి సిబ్బంది ధనలక్ష్మి, అశోక్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బాల్య వివాహాల నిర్మూలన, బాలికల రక్షణ, చట్టాలపై అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.


# వైసిపి పాయకరావుపేట పట్టణ శాఖ ఉపాధ్యక్షులుగా దోమాడ సుందరరావు





**పాయకరావుపేట , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాయకరావుపేట పట్టణ శాఖ ఉపాధ్యక్షులుగా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ డైరెక్టర్, పార్టీ సీనియర్ బిసి నాయకులు దోమాడ సుందరరావును నియమిస్తూ ఆ పార్టీ మండల శాఖ అధినాయకత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూరిబాబు, టౌన్ ప్రెసిడెంట్ ధనిశెట్టి మహేష్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా సహా నేతలకు పట్టణ ఉపాధ్యక్షులుగా నూతనంగా నియమితులైన సుందరరావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా దోమాడ సుందరరావు మాట్లాడుతూ... పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీని బలోపేతం చేయడంతో పాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

# పరిశుభ్రతే ప్రగతికి సోపానం..తాచేరు బ్రిడ్జి వద్ద 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' శ్రమదానం!



**వి.మాడుగుల , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** "మన ఊరు – మన పరిశుభ్రత" నినాదంతో, మండలంలోని తాచేరు సమీపంలో నూతనంగా నిర్మించిన బ్రిడ్జి వద్ద 'స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు భాగస్వాములై, శ్రమదానంతో బ్రిడ్జి పరిసరాలను శుభ్రపరిచి, మొక్కలు నాటారు. కేవలం అధికారులకే పరిమితం కాకుండా, ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్క స్థానిక పౌరుడు తన బాధ్యతగా పాల్గొనడం అభినందనీయం. పరిసరాల పరిశుభ్రత మన ఆరోగ్యానికి, గ్రామాభివృద్ధికి ఎంత ముఖ్యమో ఈ స్ఫూర్తిదాయక కార్యక్రమం చాటిచెబుతోంది. చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు కూడా ఈ చొరవను అందిపుచ్చుకుని, తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంపీడీవో కొంకి అప్పారావు నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమం, భవిష్యత్తులో ప్రతి గ్రామంలోనూ ఇలాంటి శ్రమదానాలకు ఒక నూతన ఉత్తేజాన్ని ఇస్తుందని ఆశించవచ్చు.

# పెరిగిన నిత్యావసర ధరలను తగ్గించాలి

## రేషన్ షాపుల ద్వారా 14 రకాల సరుకులు అందించాలి : ఐద్వా



**వి.ఆర్.పురం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై తీవ్ర భారం పడుతోందని, పెరిగిన ధరలను వెంటనే తగ్గించి రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో శనివారం రేకపల్లి జంక్షన్ నుంచి ర్యాలీ, మానవహారం నిర్వహించి అనంతరం తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకురాలు సిహెచ్.రమణి మాట్లాడుతూ.. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో సామాన్య కుటుంబాలు కనీస ఆహారం కూడా తీసుకోలేని పరిస్థితికి చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గుడ్డు ధర రూ.8కు చేరిందని, కందిపప్పు, చింతపండు, వంటనూనె, ఉల్లిపాయలు, కూరగాయల ధరలు పెరగడంతో మహిళలపై ఆర్థిక భారం మరింత పెరిగిందన్నారు. పెరిగిన ధరలను నియంత్రించడంతో పాటు రేషన్ షాపుల ద్వారా 14 రకాల సరుకులను అందించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరల కారణంగా మహిళలు పౌష్టికాహారం తీసుకోలేక రక్తహీనత వంటి సమస్యలతో బాధపడుతున్నారని, ప్రభుత్వం వెంటనే ధరల నియంత్రణకు చర్యలు చేపట్టి పేదలకు అందుబాటులో నిత్యావసర సరుకులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కారం లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యురాలు పార్వతి, మండల కార్యదర్శి రమాదేవి, దారమ్మ, పులిబద్రమ్మ, మాజీ సర్పంచ్ గొర్రె శ్రీదేవి, అచ్చమ్మ, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు

# హెడ్ మాస్టర్ తీరుపై ఎమ్మెల్యే గంటా ఆగ్రహం



**మధురవాడ / భీమిలి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** భర్తను కోల్పోయి సెలవు అడిగిన టీచర్ గజలక్ష్మి పట్ల పరుష పదజాలం వాడటం సహా సిబ్బందితో దురుసుగా ప్రవర్తిస్తున్న చంద్రంపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకట్రావు వైఖరిపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంవీపీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో విద్యాశాఖ అధికారులతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. పాఠశాల వాతావరణం దెబ్బతినకుండా ఆయన స్థానంలో వివాదరహితుడైన కొత్త హెడ్‌మాస్టర్‌ను నియమించాలని ఆదేశించారు. ఈఅంశంపై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని, త్వరలోనే కొత్త హెచ్‌ఎమ్‌ను నియమిస్తామని ఆర్జేడీ విజయ్ భాస్కర్ తెలిపారు. సమావేశంలో డీఈఓ ప్రేమ్ కుమార్, డిప్యూటీ డీఈఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

# తపాలా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

**గ్రామీణ ప్రజలకు చేరువగా తపాలా సేవలు..పోలవరం పరిహారాన్ని భద్రంగా పొదుపు చేసుకోండి : తపాలా శాఖ**

**పోలవరం జిల్లా (చింతూరు , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** తపాలా శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పొదుపు, బీమా, బ్యాంకింగ్ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చింతూరు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మారోజు వెంకట రమణ మూర్తి కోరారు. ఒడిశా రాష్ట్రం నుంచి బదిలీపై చింతూరు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో కనీస సదుపాయాలు లేని మారుమూల గ్రామాల్లో సైతం తపాలా శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నామని తెలిపారు. దట్టమైన అటవీ ప్రాంతాలు, గిరిజన గ్రామాలతో కూడిన చింతూరు ఏజెన్సీలో తపాలా శాఖ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాజమండ్రి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కోట శేషారావు ప్రోత్సాహం అందిస్తున్నారని తెలిపారు.



**గ్రామీణ పొదుపును ప్రోత్సహించాలి**

గ్రామీణ ప్రాంతాల్లో చిన్న మొత్తాలతో పొదుపు చేసే విధానాన్ని తపాలా శాఖ ప్రోత్సహిస్తోందన్నారు. గ్రామ స్థాయిలోనే చిన్న మొత్తాల పొదుపు ఖాతాలను ప్రారంభించుకునే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు తపాలా పొదుపు పథకాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. తపాలా సిబ్బంది గ్రామస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటారని, వారి అవసరాలకు అనుగుణంగా వివిధ తపాలా సేవలను అందిస్తున్నారని వివరించారు.

**పోలవరం పరిహారాన్ని భద్రంగా దాచుకోండి**

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు అందుతున్న పరిహారం మొత్తాన్ని భద్రంగా పొదుపు చేసుకోవాలని అధిక వడ్డీలకు ఆశపడి ప్రైవేటు రంగ సంస్థలలో లేదా ఇతర వ్యక్తులను నమ్మి మోసపోతున్న గిరిజన ప్రాంత ప్రజలకు భద్రమైన ఫిక్స్ డిపాజిట్ మంచి వడ్డీ రేట్లు నిచ్చే కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఉపయోగించుకుంటే మీ డబ్బులు భద్రంగా ఉంటాయని వెంకట రమణ మూర్తి సూచించారు. దేశవ్యాప్తంగా విస్తృత నెట్‌వర్క్ కలిగిన తపాలా శాఖలో వివిధ పొదుపు పథకాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లను ప్రజలు వినియోగించుకోవచ్చన్నారు. పెద్ద మొత్తాలను తపాలా శాఖ పొదుపు పథకాల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా వడ్డీ ఆదాయాన్ని పొందే అవకాశం ఉందన్నారు.

**సాంకేతిక విస్తరణతో యువతకు వేలాది ఉపాధి అవకాశాలు**

తపాలా జీవిత బీమా పథకాలు ప్రజల్లో విశ్వాసాన్ని పొందాయని ఆయన తెలిపారు. గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సరళమైన బీమా పథకాలను తపాలా శాఖ అందిస్తోందన్నారు. ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ద్వారా ప్రభుత్వ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతుందని, ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలు సైతం ఖాతాల్లో జమ అవుతున్నాయని ,కేంద్ర ప్రభుత్వం తపాలా శాఖను మరింత అభివృద్ధి చేస్తూ, కొత్త సాంకేతికతను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తూ యువతను భాగస్వాములను చేస్తోందని వెంకట రమణ మూర్తి తెలిపారు. ప్రజల సొమ్ముకు భద్రతతో పాటు పొదుపు చేసే అవకాశం కల్పించే తపాలా శాఖ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజా ప్రతినిధులు సైతం తపాలా శాఖ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, మరింత మంది సేవలను పొందేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఇదే సందర్భంలో నూతనంగా చింతూరు సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకట రమణ మూర్తిని రాజమండ్రి అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ. శ్రీనివాసరావు, రంపచోడవరం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ షేక్ అబ్దుల్ అభినందించారు.

# క్రీడల్లో సత్తా చాటిన జీకేవీధి ఏకలవ్య పాఠశాల విద్యార్థులు

## 17 స్వర్ణ పతకాలు.. వాలీబాల్‌లోనూ బంగారు పతకం కైవసం

**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** అరకు ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించిన క్రీడా పోటీల్లో గూడెంకొత్తవీధి ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. క్రీడా విభాగం పరిధిలోని పాఠశాలల మధ్య నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో జీకేవీధి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. వివిధ క్రీడలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొత్తం 17 స్వర్ణ పతకాలు సాధించి విజేతలుగా నిలిచారు. ముఖ్యంగా వాలీబాల్ పోటీల్లో జీకేవీధి విద్యార్థులు అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించారు. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా సాగిన పోటీలో జీకేవీధి విద్యార్థులు సమన్వయంతో, పట్టుదలతో ఆడి ప్రత్యర్థి జట్టుపై విజయం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఆటలో ప్రతి





విద్యార్థి సమష్టిగా కృషి చేస్తూ జట్టు విజయానికి దోహదపడటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మూడు రోజులపాటు జరిగిన క్రీడా పోటీల్లో విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజయాల కోసం నిరంతరం సాధన చేసిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహం, శిక్షణ ఎంతగానో ఉపయోగపడిందని పాఠశాల వర్గాలు పేర్కొన్నాయి. విద్యార్థులు సాధించిన 17 స్వర్ణ పతకాలతో పాఠశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. జీకేవీధి ఏకలవ్య పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలవడం పట్ల ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నతస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని పాఠశాలకు, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ రమణారావు ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారి ప్రతిభను వెలికితీసేందుకు పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషికి ఈ విజయం నిదర్శనంగా నిలిచిందని ప్రిన్సిపాల్ రమణారావు అభినందించారు.

## ఇళ్ల పట్టాల పంపిణీతో పేదల సొంతింటి కల సాకారం

**కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తోంది : ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్**



**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖపట్నం విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి జనసేన పార్టీ విశాఖపట్నం నగర అధ్యక్షులు, దక్షిణ నియోజకవర్గం శాసనసభ సభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్‌లోని హెలీప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయడంలో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోందన్నారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం ద్వారా ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు భరోసా కలుగుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, పేదలు, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం లో అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా కొనసా గుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పేదల జీవితాల్లో స్థిరత్వం, భద్రత కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు.

## నిమజ్జన ప్రాంతాలను సందర్శించి పర్యవేక్షిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

**ట్రాఫిక్ క్లియరెన్స్, గజ ఈతగాళ్ల సేవలపై ప్రత్యేక దృష్టి**

**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** నగరంలో నిమజ్జనాలు జరుగుతున్న తీరును స్వయంగా పరిశీలించేందుకు నగర పోలీసు కమీషనర్ డా. శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్. క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. శనివారం భీమిలి, ఐటీ సెజ్, సాగర్ నగర్, జోడుగుళ్ల పాలెం, లంబిని పార్క్, గోకుల్ పార్క్, ఎన్.సి.బి జాలరిపేట, ఇతర నిమజ్జన ప్రాంతాలను సీపీ గారు సందర్శిస్తున్నారు.

**సీపీ తీసుకున్న చర్యలు:**

నిమజ్జన ప్రాంతాలకు వెళ్లే రహదారులు ట్రాఫిక్ లేకుండా ఉండేలా చర్యలు.. మద్యం మత్తులో ఎవరూ ఆయా ప్రాంతాలలో తిరగకుండా నిఘా.. గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండి, డబ్బులు డిమాండ్ చేయకుండా నిమజ్జనానికి సహకరించేలా తగు చర్యలు తీసుకోవడం జరిగింది. నగర పోలీసు తరపున భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

# ఎనిమిదేళ్లుగా మంచానికే పరిమితం - అయినా అందలేదు ప్రభుత్వ సహాయం

**- పక్షవాతంతో కదలలేని స్థితి..ఐదుగురు కుమార్తెలతో బతుకు భారంగా మారిన దుస్థితి**

**- ముఖ్యమంత్రి సారూ..మా కుటుంబాన్ని ఆదుకోండి అంటూ కన్నీటితో వేడుకోలు**



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** ఒకవైపు అనారోగ్యం.. మరోవైపు ఆర్థిక ఇబ్బందులు.. కుటుంబాన్ని పోషించాల్సిన వ్యక్తి ఎనిమిదేళ్లుగా మంచానికే పరిమితమవడంతో ఐదుగురు కుమార్తెలతో ఓ కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో కాలం వెళ్లదీస్తోంది. రింతాడ పంచాయతీ కోరాపల్లి గ్రామానికి చెందిన గేమిలి దావీదు కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఎనిమిదేళ్ల క్రితం పక్షవాతం బారినపడిన దావీదు అప్పటి నుంచి మంచానికే పరిమితమయ్యారు. నడవలేని, సాధారణంగా తన పనులు తాను చేసుకోలేని పరిస్థితిలో ఉండటంతో కుటుంబ సభ్యులే ఆయనకు అన్నివిధాలా సహాయం చేయాల్సి వస్తోంది. దావీదుకు భార్య గేమిలి శాంతికుమారి, కుమార్తెలు దీవెనకుమారి, దీపిక, కరుణ, దివ్య, వైష్ణవి ఉన్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా నిలవాల్సిన దావీదు అనారోగ్యం కారణంగా ఉపాధికి దూరం కావడంతో కుటుంబ ఆదాయం పూర్తిగా దెబ్బతింది. ఒకవైపు దావీదు వైద్య ఖర్చులు, మందుల అవసరాలు.. మరోవైపు ఐదుగురు కుమార్తెల నిత్యావసరాలు.. ఇలా ఖర్చులు పెరుగుతున్నా వాటిని భరించే స్థిరమైన ఆదాయం లేక కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజువారీ అవసరాలు తీర్చుకోవడం కూడా కష్టంగా మారిందని కుటుంబ సభ్యులు కన్నీటితో చెబుతున్నారు.

**ఎనిమిదేళ్లుగా ఒకే మంచం..**

పక్షవాతం వచ్చిన నాటి నుంచి దావీదు జీవితం మంచానికే పరిమితమైంది. కుటుంబ సభ్యుల సహాయం లేకుండా కదలలేని పరిస్థితిలో ఉండటంతో ఆయన సంరక్షణ కూడా కుటుంబానికి నిరంతర బాధ్యతగా మారింది. సంవత్సరాలు గడుస్తున్నా పరిస్థితిలో మార్పు రాకపోవడం, వైద్యానికి అవసరమైన ఖర్చులు పెరుగుతుండటంతో కుటుంబం మరింత ఆర్థిక ఒత్తిడికి గురవుతోంది. అయినప్పటికీ కుటుంబ సభ్యులు ధైర్యం కోల్పోకుండా దావీదును చూసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

**ఐదుగురు కుమార్తెలతో కుటుంబ పోషణ భారంగా..**

దావీదు అనారోగ్యంతో ఉపాధి చేయలేని పరిస్థితిలో ఉండటంతో భార్య శాంతికుమారిపై కుటుంబ బాధ్యత మరింత పెరిగింది. ఐదుగురు కుమార్తెలతో కలిసి కుటుంబాన్ని నెట్టుకురావడం ఆమెకు ఎంతో కష్టంగా మారింది. నిత్యావసరాలు, వైద్య ఖర్చులు, పిల్లల అవసరాలు ఒకేసారి ఎదురవుతుండటంతో ఏ దిక్కుతోచని పరిస్థితి నెలకొందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబ పరిస్థితిని ప్రభుత్వం గుర్తించి అండగా నిలవాలని వారు వేడుకుంటున్నారు.

**ముఖ్యమంత్రి సహాయ నిధిపై ఆశలు..**

తమ కుటుంబ పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సాధ్యమైనంత ఆర్థిక సహాయం అందించాలని కుటుంబ సభ్యులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని వేడుకుంటున్నారు. “ఎనిమిదేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యారు. కుటుంబాన్ని పోషించడానికి ఆదాయం లేదు. ఐదుగురు కుమార్తెలతో బతుకు భారంగా మారింది. మా పరిస్థితిని గుర్తించి ప్రభుత్వం అండగా నిలవాలి” అంటూ కుటుంబ సభ్యులు కన్నీటితో విజ్ఞప్తి చేస్తున్నారు. దావీదు కుటుంబం ఎదుర్కొంటున్న పరిస్థితిని సంబంధిత అధికారులు స్వయంగా పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని గ్రామస్థులు కోరుతున్నారు. ముఖ్యమంత్రి దృష్టికి ఈ కుటుంబ గోడును తీసుకెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీర్ఘకాలంగా మంచానికే పరిమితమైన దావీదుకు వైద్య సహాయం, కుటుంబానికి ఆర్థిక భరోసా లభిస్తే వారి జీవితాల్లో కొంతైనా వెలుగు నిండుతుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఎనిమిదేళ్లుగా పక్షవాతంతో పోరాడుతున్న దావీదు.. ఐదుగురు కుమార్తెల భవిష్యత్తు కోసం ఆందోళన చెందుతున్న కుటుంబ సభ్యులు.. ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్న ఈ కుటుంబానికి ఇకనైనా అధికార యంత్రాంగం అండగా నిలవాలని కోరాపల్లి గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం స్పందించి దావీదు కుటుంబానికి తగిన ఆర్థిక సహాయం అందించాలని కోరుతున్నారు.

# సంకాడలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం

**పరిశుభ్రతే ప్రగతికి పునాది..గ్రామ పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన : ఎంపీడీవో**




**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** మండలంలో సంకాడ గ్రామంలో స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి రమణబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పరిశుభ్రత, పారిశుధ్య పరిరక్షణ, పరిసరాల స్వచ్ఛతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, ఇళ్ల నుంచి వెలువడే చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు వివరించారు. పరిసరాల్లో చెత్త పేరుకుపోవడం, మురుగు నీరు నిలిచిపోవడం వల్ల దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, అందువల్ల గ్రామస్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర--స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధన కేవలం అధికారుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాలను సంపూర్ణంగా పరిశుభ్రంగా తీర్చిదిద్దగలమని ఎంపీడీవో రమణబాబు పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామ పరిశుభ్రత కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రమైన గ్రామం ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అవుతుందని తెలిపారు. గ్రామస్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు స్వచ్ఛతను నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు స్థానిక ప్రజలు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కళ్యాణ్ బాబు అధికారులు,సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమం

**గర్భిణీలు, రోగులు,వృద్ధుల ఆరోగ్యంపై ప్రజా వైద్యుల అవగాహన కార్యక్రమం**



**నక్కపల్లి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** గర్భిణీలు, రోగుల ఆరోగ్య సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు, “ సేవా సంకల్ప అభియాన్ “ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా వైద్యులు ఆరోగ్య సమస్యలు, గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు, పోషకాహారం, సకాలంలో వైద్య సేవలు పొందాల్సిన అవశ్యకతపై వివరించారు. గర్భిణీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, మహిళలు, వృద్ధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఆరోగ్యం పై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సి హెచ్ ఓ భవాని, హెల్త్ ఎడ్యుకేటర్ లక్ష్మణమూర్తి, హెచ్.వి పార్వతి, హెల్త్ చెట్లు రమణ, రవి, ఎమ్ ఎల్ హెచ్ పి ఇంద్రాదేవి, ఏఎన్ఎం కుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రింతాడ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం

## గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారంపై అవగాహన



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** మండలంలో రింతాడ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8వ తేదీ వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇద్దరు గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించి, వారి కుటుంబ సభ్యులను ఆహ్వానించారు. గర్భిణీలు ఆరోగ్యంగా ఉండటంతో పాటు గర్భంలోని శిశువు సంపూర్ణ ఎదుగుదలకు పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ఎంతో అవసరమని నిర్వాహకులు వివరించారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు తదితర పోషక పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్నారులకు వయసుకు తగిన పోషకాహారం అందించాలని అంగన్‌వాడీ సిబ్బంది సూచించారు. "పోషకాహారం--ఆరోగ్యకరమైన కుటుంబానికి పునాది" అనే సందేశంతో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు మోహిని, కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, కుటుంబ సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# దేవరపల్లి పంచాయతీలో పర్యటించిన డిడిఓ..అభివృద్ధి పనుల పరిశీలన

## పారిశుద్ధ్య నిర్వహణ సంపద కేంద్రాలు, క్లాప్ మిత్రల పనితీరుపై ఆరా

**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** మండలంలో శనివారం పర్యటించిన డివిజన్ డెవలప్‌మెంట్ అధికారి జయప్రకాశ్ దేవరపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. పంచాయతీ పరిధిలో గ్రామాల వారీగా కొనసాగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తీరును సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నిత్యం చేపడుతున్న పారిశుద్ధ్య పనులు, పరిసరాల పరిశుభ్రత, చెత్త నిర్వహణ తదితర అంశాలపై వివరాలు సేకరించారు. అనంతరం పంచాయతీ పరిధిలోని సంపద కేంద్రాలను సందర్శించి వాటి నిర్వహణ, పనితీరును పరిశీలించారు. గ్రామాల్లో సేకరించే వ్యర్థాలను సక్రమంగా నిర్వహిస్తూ పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే క్లాప్ మిత్రల పనితీరును పర్యవేక్షించి, వారికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీ



పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని జయప్రకాశ్ సూచించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. మండల అభివృద్ధికి అవసరమైన పలు అంశాలపై అధికారులతో చర్చించి, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఎంపీడీవో రమణబాబు, సంబంధిత అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ముషిడిపల్లి నాగరాయుడు చెరువు వద్ద పారిశుద్ధ్య పనులు ముమ్మరం - ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛతే హి సేవా



**దేవరాపల్లి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** స్వచ్ఛతే హి సేవా కార్యక్రమంలో భాగంగా దేవరాపల్లి మండలం ముషిడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని నాగరాయుడు చెరువు వద్ద శనివారం విస్తృతంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా చెరువు గట్టు పరిసరాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, జంగిల్స్ ను తొలగించి చెరువును శుభ్రం చేశారు. మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌డీవో మంజులా వాణి, ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మీ ఆధ్వర్యంలో జేసీబీలు, ట్రాక్టర్లు, బ్లేడు ట్రాక్టర్లతో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు, సచివాలయ సిబ్బంది చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చెరువుల పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, జీవీఎస్‌డబ్ల్యుఎస్ అలివేణమ్మ, ఎంఈఓ ఈశ్వరరావు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ చంద్రశేఖర్, ఇన్‌ఛార్జ్ డిప్యూటీ ఎంపీడీవో అనంత ఉమాదేవి, హౌసింగ్ ఇన్‌ఛార్జ్ తేజ, ఏపీఎం ప్రభాకర్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, పంచాయతీ కార్యదర్శి వినోద్, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ వీపీపీ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటిఎస్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర ద్రోహం

## రాజ్యాంగ హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదు : సీపీఎం



**వి. ఆర్. పురం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** పోలవరం బహుళార్థసాధక ప్రాజెక్టు నిర్వాసితులైన ఆదివాసీలను పునరావాస ప్రక్రియ నుండి తప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పన్నిన కుట్రను సీపీఎం పోలవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నంరాజులు తీవ్రంగా ఖండించారు. మండలంలోని రేకపల్లి బొప్పన భీమయ్య కార్యాలయం నందు ముఖ్య నాయకుల సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు మాట్లాడుతూ సమావేశంలో గిరిజనేతరులకు అమలు చేస్తున్న వన్ టైమ్ సెటిల్మెంట్ విధానాన్ని ఏజెన్సీ ప్రాంత గిరిజన కుటుంబాలకు వర్తింపజేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించడం రాజ్యాంగ ఉల్లంఘన, గిరిజన తెగల ఉనికికే ప్రమాదకరంగా మారుతుందని ఆయన అన్నారు. గిరిజనుల జీవితం అడవి, భూమి, కమ్యూనిటీ వ్యవస్థతో ముడిపడి ఉంది. ఓ టి ఎస్ పేరిట కొంత నగదు చేతిలో పెట్టి తరిమేస్తే, గిరిజనులు తమ సంస్కృతిని, కమ్యూనిటీ మూలాలను కోల్పోయి అనాథలవుతారు. ప్రస్తుత ధరల ప్రకారం ప్రభుత్వం ఇచ్చే అరకొర నగదుతో బయట సెంటు భూమి గానీ, ఇల్లు గానీ కొనుగోలు చేయలేరు. ఆర్థిక అవగాహన లేని గిరిజనులు దళారుల చేతిలో మోసపోయి ఉన్న డబ్బును కోల్పోయి శాశ్వత దారిద్ర్యంలోకి నెట్టబడతారు. పునరావాస ఆర్ అండ్ ఆర్ కాలనీలలో లభించే బడులు, ఆసుపత్రులు, నీటి సదుపాయాలు, రోడ్లు మరియు ప్రభుత్వం కల్పించాల్సిన ప్రత్యామ్నాయ జీవనోపాధి హక్కులను గిరిజనులు శాశ్వతంగా కోల్పోతారు.

**ల్యాండ్ అక్విజిషన్ ఆర్ అండ్ ఆర్ చట్టం 2013 యాక్ట్ ఉల్లంఘన**

ఈ చట్టంలోని సెక్షన్ 41, 42 ప్రకారం షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనులను సాధ్యమైనంతవరకు నివాసాల నుండి ఖాళీ చేయించకూడదు. ఒకవేళ చేయాల్సి వస్తే వారికి "భూమికి భూమి" పక్కా ఇల్లు మరియు ఆర్ అండ్ ఆర్ కాలనీలలో 28 రకాల మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వం యొక్క చట్టబద్ధమైన బాధ్యత. నగదు ఇచ్చి చేతులు దులుపుకోవడం చట్ట విరుద్ధం అవుతుందని ఆయన అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల స్వయం ప్రతిపత్తిని, ప్రత్యేక రక్షణలను ఐదో షెడ్యూల్ హామీ ఇస్తుంది. ఓ టి ఎస్ ద్వారా గిరిజనులను మైదాన ప్రాంతాలకు చెల్లాచెదురు చేయడం వల్ల వారి రాజ్యాంగ రక్షణలు, 'షెడ్యూల్ తెగ' హోదా దెబ్బతింటాయి. షెడ్యూల్ ప్రాంతాలలో నిర్వాసితుల పునరావాస విధానంలో ఎలాంటి మార్పులు చేయాలన్నా సంబంధిత గ్రామసభల ముందస్తు ఆమోదం తప్పనిసరి. ప్రభుత్వం గ్రామసభలను కాలరాసి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని అన్నారు.. గిరిజనేతరులకు భూముల బదిలీని నిరోధించే 1/70 చట్టం స్ఫూర్తిని దెబ్బతీస్తూ, గిరిజనులను ఖాళీ చేయించి ఆ భూములను కార్పొరేట్ సంస్థలకు, ప్రాజెక్టులకు అప్పగించే పరోక్ష కుట్ర ఇందులో దాగి ఉందని అన్నారు. జీవో ఎం ఎస్ నెంబర్ 68 లోపాల అమలు? రాష్ట్ర ప్రభుత్వ పునరావాస విధాన ప్రకారం నిర్వాసిత కుటుంబానికి నిర్దేశిత ప్రమాణాల ప్రకారం ఇల్లు, పరిహారం అందించాలి. ఓ టి ఎస్ ద్వారా ఈ జీవో అమలు నుండి ప్రభుత్వం తప్పుకుంటోందని ఆయన ఎదోవ చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్నవారు. సిపిఎం జిల్లా నాయకులు సోయం చిన్నబాబు మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్ మండల కార్యదర్శి వర్గ సభ్యులు పంకు. సత్తిబాబు కారం సుందరయ్య, మండల నాయకులు పూనెం. ప్రదీప్ కుమార్, గుండుపూడి లక్ష్మణరావు కమ్మ చిచ్చు. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు


# మంగాపురం కాలనీలో అంగరంగ వైభవంగా వినాయక అన్న సమారాధన



**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** మంగాపురం కాలనీలో హిందూ-ముస్లిం ఐక్యతకు ప్రతీకగా వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగాపురం కాలనీ తారా మసీదు సమీపంలో ఎం. పుష్పలత - పండు దంపతుల ఆధ్వర్యంలో, ఎంపీసీ బాయ్స్ ు గర్ల్స్ సహకారంతో అన్నసమారాధన కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విగ్రహ దాత ఆర్ జె హోమ్స్ మణికొండ మణికంఠ అందించారు. ఈ కార్యక్రమంలో యువత, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యూత్ తరఫున రాజు, హారిక, పండు టైలర్, పుష్ప, కుమార్, మానసా, భాగ్య, కిట్టు, కవిత, అఖిల్, ఇమ్రాన్, తిరుపతి, బన్నీ, సందీప్, జోను, ప్రణయ్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించారు. హిందూ-ముస్లిం సోదరభావం, మత సామరస్యం చాటేలా వినాయక చవితి సందర్భంగా అన్నసమారాధన నిర్వహించడం పట్ల స్థానికులు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 22వ వైస్సార్సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ హాజరై దేవుడి దక్షిణ అందించి నిర్వాహకులను అభినందించారు మరియు గౌరవ అతిథిగా మనం దినపత్రిక ఉత్తరాంధ్ర రీజనల్ బ్యూరో చీఫ్--మరియు నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ సౌత్ ఇండియా వైస్ చైర్మన్ ఎం.వీ.ఎస్.జీ. తిలక్ మరియు మీడియా ప్రతినిధులు మరియు అఖిల్ పాల్గొని వినాయకుని దీవెనలు అందుకున్నారు.




# స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర మైక్రో లోగో సీఎంకు అందజేసిన నాగ సూర్య





**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** శుద్ధ ముక్కపై తయారుచేసిన స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర మైక్రోలోగోను చిత్రకారుడు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు అందజేశారు. స్వర్ణాంధ్ర 2047 మరియు కళ్ళజోడు లోగో సుధముక్కపై మైక్రో ఆర్ట్ వివరాల్లోకి వెళితే కోడూరి నాగ సూర్య రాఘవేంద్ర బాబు అని ఎంబీఏ విద్యార్థి శుద్ధముక్కు పై రాస్తూ ఉంటారు ఈ సందర్భంగా నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజున విశాఖ పర్యటనకి విచ్చేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కి పర్యటనలో భాగంగా కోడూరి నాగ సూర్య రాఘవేంద్ర బాబు . స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛందర 2047 కళ్ళజోడు లోగో మైక్రో ఆర్ట్ చేశారు ఈ సందర్భంగా నాగ సూర్య రాఘవేంద్ర బాబు మాట్లాడుతూ మన మన ప్రదేశాలు మనమే శుభ్రంగా ఉంచుకోవాలని కోరారు అలాగే నాకు గతంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నందు ఒక రికార్డు ఒక సర్టిఫికెట్ వచ్చిందని తెలిపారు భవిష్యత్తులో సమాజ సేవే నా లక్ష్యంగా పెట్టుకున్నాను ఈ సందర్భంగా రాఘవేంద్ర బాబు తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# మధురవాడలో వీధికుక్కల దండయాత్ర

**- పసివాడిపై విరుచుకుపడ్డ శునకాలు !**

**- అధికారుల నిర్లక్ష్యానికి ఐదేళ్ల బాలుడు తీవ్ర గాయాలు.. క్షణక్షణం భయం భయంలో స్థానికులు!**



**మధురవాడ (విశాఖపట్నం) , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** విశాఖ నగరంలో వీధికుక్కలు పిచ్చిగా ప్రవర్తిస్తూ ప్రజలపై పంజా విసురుతున్నాయి. జీవీఎంసీ మధురవాడ జోన్ పరిధిలోని డి-మార్ట్ సమీపంలో ఆడుకుంటున్న ఐదేళ్ల పసివాడిపై వీధికుక్కల గుంపు విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. అధికారుల అలసత్వం, పట్టింపులేనితనమే ఈ ఘోరానికి కారణమని, ప్రజా ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని స్థానికులు తీవ్ర ఆగ్రహజ్వాలలు వ్యక్తం చేస్తున్నారు.

**ఆర్తనాదాలతో వణికిపోయిన ప్రాంతం:**

శ్రీకాకుళం జిల్లా గొప్పిలి గ్రామానికి చెందిన వడ్డీ దుర్గారావు, సోహిత దంపతులు బతుకుదెరువు కోసం మధురవాడకు వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి ఐదేళ్ల కుమారుడు కిరణ్ కుమార్ అంగన్‌వాడీలో చదువుతున్నాడు. ఈ నెల 14వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న కిరణ్‌పై ఒక్కసారిగా కుక్కల గుంపు విరుచుకుపడింది. పిచ్చిగా కొరుకుతున్న కుక్కల బారి నుండి బాబును కాపాడేందుకు తల్లి, దారిన వెళ్లే వాహనదారులు సాహసించి కుక్కలను తరిమికొట్టారు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న బాలుడిని మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, ఆపై పరిస్థితి విషమంగా ఉండటంతో '108'లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం బాలుడు అత్యవసర చికిత్స పొందుతున్నాడని, ప్రాణాపాయం తప్పిందని వైద్యులు వెల్లడించారు.

**జీవీఎంసీ నిద్రమత్తు వదిలేదెప్పుడు?**

మధురవాడ వ్యాప్తంగా వీధికుక్కల బెడద తీవ్రస్థాయికి చేరినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంపై యువత, ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. వీధుల్లో చిన్నారులు, వృద్ధులు అడుగుపెట్టాలంటేనే వణికిపోతున్నారు. ప్రజా క్షేమాన్ని గాలికి వదిలేసిన జీవీఎంసీ యంత్రాంగం తక్షణమే స్పందించి కుక్కల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోకపోతే, మధురవాడ జోనల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని యువజన సంఘాలు, స్థానికులు తీవ్ర స్థాయిలో హెచ్చరిస్తున్నారు.

# ముస్లిం సమస్యలపై ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు అహ్మద్ షరీఫ్ కు విన్నపం

**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు అహ్మద్ షరీఫ్‌ను ముస్లిం పెద్దలు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించారు. చిన్న వాల్తేరు మహమ్మదీయ మసీదుకు నమాజ్ నిమిత్తం వచ్చిన అహ్మద్ షరీఫ్‌ను మక్కా మసీదు అధ్యక్షులు షేక్ మునీర్, చిన్న వాల్తేరు మహమ్మదీయ మసీదు కార్యదర్శి, ట్రెజరర్లు ముస్తఫా, నౌషాద్, సీనియర్ న్యాయవాది ఐ.ఎం. అహ్మద్ తదితరులు కలిసి ముస్లింల సమస్యలపై కొంతసేపు చర్చించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఐ.ఎం. అహ్మద్ చిన్న వాల్తేరు మసీదు పరిధిలోని కొంత స్థలంలో కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు సహకరించాలని అహ్మద్ షరీఫ్‌ను కోరారు. కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి వస్తే పేదలు, స్థానిక ప్రజలకు వివాహాలు, ఇతర శుభకార్యాలు నిర్వహించుకోవడంతో పాటు రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ కార్యక్రమాలకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. ఈ అంశంపై సానుకూలంగా పరిశీలించాలని వారు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ మైనారిటీ వ్యవహారాల సలహాదారు అహ్మద్ షరీఫ్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మసీదు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



# వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి

- బయోగ్యాస్, సీ అండ్ డీ ప్లాంట్లను సమర్థవంతంగా వినియోగించాలి
- సీ అండ్ డీ వ్యర్థాలతో తయారైన ఉత్పత్తులను జీవీఎంసీ పనుల్లో ఉపయోగించాలి
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ



**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** నగరంలో ఉత్పత్తయ్యే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహిస్తూ, వాటిని ఉపయోగకరమైన వనరులుగా మార్చేందుకు కాపులుప్పాడలో ఏర్పాటు చేసిన ప్లాంట్లను సమర్థవంతంగా వినియోగించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి. నారాయణ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. శనివారం కాపులుప్పాడ డంపింగ్ యార్డులోని బయోగ్యాస్ ప్లాంట్, నిర్మాణ--కూల్చివేత (సీ అండ్ డీ) వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి మంత్రి పరిశీలించారు. ప్లాంట్ల సామర్థ్యం, వ్యర్థాల సేకరణ, శుద్ధి ప్రక్రియ, ఉత్పత్తి తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరంలో ఉత్పత్తయ్యే తడి వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేసి బయోగ్యాస్ ప్లాంట్‌కు తరలించే వ్యవస్థను మరింత పటిష్టం చేయాలన్నారు. హోటళ్లు, మార్కెట్లు, ఫంక్షన్ హాళ్లు, వాణిజ్య సంస్థలు తదితర ప్రాంతాల నుంచి తడి వ్యర్థాలు నిరంతరాయంగా ప్లాంట్‌కు చేరేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యర్థాల నుంచి బయోగ్యాస్, విద్యుత్, సేంద్రియ ఎరువుల ఉత్పత్తిని సమర్థవంతంగా చేపట్టడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు వ్యర్థాల నిర్వహణలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. అదేవిధంగా నగరంలో ఉత్పత్తయ్యే నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను రోడ్ల పక్కన, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో పారవేయకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వాటిని సీ అండ్ డీ ప్లాంట్‌కు తరలించి శాస్త్రీయంగా శుద్ధి చేసే విధంగా సమగ్ర వ్యవస్థను అమలు చేయాలన్నారు. ప్లాంట్ల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించి, నిర్దేశిత సామర్థ్యంతో పనిచేసేలా సంబంధిత విభాగాలు సమన్వయంతో వ్యవహరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు సూచించారు. అనంతరం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్, కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి కలసి సీ అండ్ డీ వ్యర్థాల శుద్ధి ప్లాంట్‌ను పరిశీలించారు.ు ప్లాంట్ ప్రస్తుతం వినియోగంలో లేకపోవడానికి గల కారణాలను ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావును అడిగి తెలుసుకున్నారు. సంబంధిత కాంట్రాక్టర్ ప్లాంట్‌ను నిర్వహించలేని పక్షంలో నిబంధనల మేరకు చర్యలు చేపట్టి, జీవీఎంసీ ఆధీనంలోకి తీసుకొని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్‌ఓపీ) రూపొందించి ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. సీ అండ్ డీ వ్యర్థాల ద్వారా తయారైన పేవర్ బ్లాకులు, బిల్డింగ్ బ్లాకులు, ఇటుకలు తదితర ఉత్పత్తులను జీవీఎంసీ చేపట్టే ఇంజనీరింగ్, అభివృద్ధి పనుల్లో వినియోగించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ చీఫ్ ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజును ఆదేశించారు. తద్వారా నిర్మాణ వ్యర్థాల పునర్వినియోగంతో పాటు సహజ వనరుల వినియోగాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ పల్లి నల్లనయ్య, మధురవాడ జోనల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు, చీఫ్ సిటీ ప్లానర్ ఎ. ప్రభాకర్ రావు, చీఫ్ ఇంజనీర్ పి.వి.వి. సత్యనారాయణ రాజు, డీసీపీ రామ్మోహన్, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు ,అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ ఎల్. రాజా రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# భక్తుల సంతృప్తే లక్ష్యం..సౌకర్యాలపై ఆరా తీసిన ఈవో



**సింహాచలం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు. శనివారం ఆలయ పరిసరాల్లో భక్తుల సౌకర్యాలను పరిశీలించిన ఆయన, ఉచిత ప్రసాదాల పంపిణీ కేంద్రం వద్ద భక్తులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. స్వామివారి దర్శనం ఎలా జరిగింది? ఎంత సమయం పట్టింది? దర్శన సమయంలో ఏమైనా ఇబ్బంది ఎదురైందా?" అంటూ భక్తులను ఈవో ప్రశ్నించారు. ఆలయ సిబ్బంది భక్తులతో మర్యాదగా వ్యవహరిస్తున్నారా? ఎవరైనా దురుసుగా ప్రవర్తించారా? అని కూడా ఆరా తీశారు. అదేవిధంగా "ప్రసాదం రుచి, నాణ్యత ఎలా ఉంది? టికెట్లు పొందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?" అని అడిగి తెలుసు కున్నారు. భక్తులు దర్శనం సౌకర్యవంతంగా జరిగిందని, సిబ్బంది సహకరిస్తున్నారని, ప్రసాదం బాగుందని సమాధానం ఇవ్వడంతో ఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. భక్తుల సౌకర్యార్థం ఇంటి నుంచే స్వామివారి దర్శన టికెట్లను ఆన్లైన్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం కల్పించినట్లు ఈవో తెలిపారు. మన మిత్ర వంటి వాట్సాప్ సేవల ద్వారా కూడా టికెట్లు బుక్ చేసుకుని నిర్ణయించిన సమయానికి స్వామివారి దర్శనానికి రావచ్చని చెప్పారు. భక్తులు ఆలయానికి వచ్చిన తర్వాత కూడా ఎక్కడా ఇబ్బందులు పడకుండా వన్‌స్టాప్ సెంటర్‌లో ఆన్లైన్ దర్శన టికెట్లతో పాటు ప్రసాదాలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. టికెట్లు, ప్రసాదాల కోసం భక్తులు వేర్వేరు ప్రాంతాలకు తిరగాల్సిన అవసరం లేకుండా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. భక్తుల సంతృప్తికరమైన దర్శనమే దేవస్థానం ప్రధాన లక్ష్యమని, భక్తుల నుంచి వచ్చే సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సేవలను మరింత మెరుగుపరుస్తామని ఈవో జల్లేపల్లి వెంకట్రావు తెలిపారు.

# దేవరాపల్లి మండలంలో ఖరారైన ఎంపీటీసీ పోలింగ్ కేంద్రాలు



**దేవరాపల్లి , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** దేవరాపల్లి మండలంలో 2026 ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించిన తుది పోలింగ్ కేంద్రాల జాబితా ఖరారైంది. మండల ప్రత్యేక అధికారి, డిడిఓ మంజులవాణి, ఎంపీడీఓ కిరణ్ వరప్రసాద్ శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఈ జాబితాను సంయుక్తంగా విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం రూపొందించిన ఈ జాబితాను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రదర్శించారు.

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రం పేరు, ప్రదేశం వివరాలను ఇందులో పొందుపరిచారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ముసాయిదా జాబితాపై ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో తుది జాబితాను ప్రచురించామన్నారు. ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా అన్ని పోలింగ్ కేంద్రాలను ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీ భవనాల్లోనే ఏర్పాటు చేశామని, ప్రతి కేంద్రంలో మంచినీరు,విద్యుత్, ర్యాంప్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. తుది జాబితాను ఎంపీడీఓ కార్యాలయ నోటీసు బోర్డు వద్ద ఉంచామని, ఓటర్లు, రాజకీయ పార్టీల నాయకులు పరిశీలించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలన అధికారి డి.వి. లక్ష్మీనారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిల్మ్ నగర్ భూ కేటాయింపుపై సీఎం హామీ



**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ కు భూమి కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, పి. విష్ణు కుమార్ రాజులు సీఎం చంద్రబాబు నాయుడుకు శనివారం వినతి పత్రాన్ని అందించారు. 2014 – 19 టీడీపీ ప్రభుత్వ హయంలో ఫిల్మ్ నగర్ కు శంకుస్థాపన చేసిన చంద్రబాబు తిమ్మాపురంలో 5 ఎకరాల భూమి కేటాయించారు. అయితే ఆ ఉత్తర్వుల్లో కొన్ని సాంకేతిక అంశాలు పేర్కొనకపోవడం వల్ల ఆ ప్రతిపాదన ముందుకు వెళ్లలేదు. సాంకేతిక అంశాలు సరి చేస్తూ జీఓ ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే హోదాలో గంటా గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ లను ప్రత్యేకంగా కలిసి కోరారు. ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమానికి విశాఖ వచ్చిన సీఎం దృష్టికి ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ భూ కేటాయింపు విషయం ఎమ్మెల్యేలు మరోసారి తీసుకువెళ్లగా ఆయన తన కార్యదర్శి ప్రద్యుమ్నతో మాట్లాడారు. వెంటనే భూ కేటాయింపునకు చర్యలు తీసుకోవాలని ప్రద్యుమ్నకు సీఎం సూచించారు. ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ భూ కేటాయింపు వేగవంతం చేయాలని సీఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ సంబంధిత అధికారులకు జారీ చేసిన లేఖను జత చేసి సీఎంకు అందజేశారు.

# బెల్ట్ షాపులపై భీమిలి పోలీసుల మెరుపు దాడులు



**భీమునిపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** భీమిలి సీఐ జి. దివాకర్ యాదవ్ ఆధ్వర్యంలో భీమిలి పోలీసులు శనివారం బెల్ట్ షాపులపై మెరుపు దాడులు నిర్వహించారు. మండలంలోని చిన్న ఉప్పాడ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న చెన్నా రమేష్ నుండి 5 మద్యం బాటిల్స్, నిడిగట్టు గ్రామంలో గుజ్జు నూకాలమ్మ వద్ద నుండి 5 మద్యం బాటిల్స్, భీమిలి ఎగువపేటలో పెద్దిరెడ్డి వెంకట రమణ నుండి 10 మద్యం బాటిల్స్, సిటీనగర్ గ్రామంలో జీరు ఈశ్వర్ ఎల్లమరెడ్డి నుండి 13 మద్యం బాటిల్స్, చిప్పాడ గ్రామంలో బోర సరస్వతి నుండి 10 మద్యం బాటిల్స్ మొత్తం 43 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకొని, అక్రమ మద్యం విక్రయిస్తున్న 5 గురు పై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలియ చేశారు.

# విశాఖ త్రాగు, పారిశ్రామిక నీటి అవసరాలపై సీఎం సమగ్ర సమీక్ష

## సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో విశాఖకు తాగునీటి కొరత రాకుండా సమగ్ర ప్రణాళిక : జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**విశాఖపట్నం , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విశాఖపట్నం నగరానికి తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు నీటి కొరత రాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర ప్రణాళిక రూపొందించారని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. విశాఖ భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని తక్షణ, చర్యలను ప్రభుత్వం చేపడుతోందన్నారు.విశాఖ తాగునీటి అవసరాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన ఇరిగేషన్, పురపాలక శాఖల ఉన్నతాధికారులు, కలెక్టర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమీక్ష నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుత నీటి వనరుల లభ్యత, నిల్వలు, పరిమితులు, ప్రత్యామ్నాయ మార్గాలు, పైప్‌లైన్లు, లిఫ్ట్‌ల ద్వారా నీటిని అందించే అవకాశాలపై సమగ్రంగా చర్చించినట్లు పేర్కొన్నారు.



### ఏలేరు – కణితి ద్వారా తాగునీటికి భరోసా

కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు ఏలేరు నుంచి ప్రస్తుతం రోజుకు 300 క్యూసెక్కుల నీరు అందుతోందని మంత్రి తెలిపారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లోనూ పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరు రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేయగలుగుతున్నామని చెప్పారు. ఏలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 10.2 టీఎంసీల నీరు ఉండగా, అందులో 6.1 టీఎంసీలు డెడ్ స్టోరేజ్గా ఉందన్నారు. 2027 జూన్ వరకు విశాఖకు రోజుకు 300 క్యూసెక్కుల నీటిని ప్రణాళికాబద్ధంగా అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఏలేరు నుంచి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు వస్తున్న నీటిని 300 నుంచి 350 క్యూసెక్కులకు పెంచే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఏలేరు డెడ్ స్టోరేజీలోని నీటిని కూడా వినియోగించుకునేలా మోటార్లు, పంపులను ముందుగానే సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని చెప్పారు.

### రైవాడకు ప్రత్యామ్నాయ నీటి వనరులపై దృష్టి

విశాఖకు మరో ప్రధాన నీటి వనరైన రైవాడ రిజర్వాయర్ సామర్థ్యం 3.6 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 0.9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. రైవాడ కింద ఉన్న సుమారు 5,000 ఎకరాల సాగును సమర్థవంతంగా నిర్వహిస్తూ, తాగునీటికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారని చెప్పారు.రైవాడకు ప్రత్యామ్నాయంగా పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి నీటిని లిఫ్ట్ చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. ఎల్‌ఎంసీ 162వ కిలోమీటర్ వద్ద లేదా అనువైన ప్రాంతంలో లిఫ్ట్ ఏర్పాటు చేసి రైవాడకు నీరు అందించే ప్రతిపాదనలను వారం రోజుల్లో పరిశీలించాలని ఆదేశించినట్లు మంత్రి పేర్కొన్నారు.

### మేఘాద్రిగెడ్డకు 100 క్యూసెక్కుల నీరు

విశాఖకు మరో ముఖ్యమైన నీటి వనరైన మేఘాద్రిగెడ్డ రిజర్వాయర్ సామర్థ్యం 1.17 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 0.2 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ నుంచి మేఘాద్రిగెడ్డకు 100 క్యూసెక్కుల నీటిని అందించే పైప్‌లైన్ పనులు ఇప్పటికే జరుగుతున్నాయని చెప్పారు. మొత్తం 10.5 కిలోమీటర్ల పైప్‌లైన్‌లో 9 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని, మరో 1.5 కిలోమీటర్ల పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు.మిగిలిన పైప్‌లైన్ పనులతో పాటు మోటార్లు, పంపుల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి మేఘాద్రిగెడ్డకు నీరు అందించాలని సీఎం ఆదేశించారని మంత్రి తెలిపారు. రైల్వే, ఎలక్ట్రికల్ క్రాసింగ్‌ల వద్ద ఉన్న సమస్యలను కూడా వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

### తాటిపూడి నీటిని సమర్థవంతంగా వినియోగించాలి

తాటిపూడి రిజర్వాయర్ సామర్థ్యం 3.3 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 1.2 నుంచి 1.26 టీఎంసీల నీరు మాత్రమే ఉందని మంత్రి తెలిపారు. తాటిపూడి నీటిని సమర్థవంతంగా వినియోగించడంతో పాటు విజయనగరం సాగునీటి అవసరాలను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సీఎం సూచించారని చెప్పారు. తక్కువ నీటితో పంటలు సాగు చేసే విధానాలను అవలంబించాలని, సాగునీటి వినియోగాన్ని పర్యవేక్షించాలని విజయనగరం కలెక్టర్‌ను సీఎం ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

### పురుషోత్తపట్నం లిఫ్ట్ చంద్రబాబు ముందుచూపుకు నిదర్శనం

విశాఖ తాగునీటి అవసరాల్లో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి అన్నారు. స్థానిక వర్షాలపై ఆధారపడే రైవాడ, మేఘాద్రిగెడ్డ, తాటిపూడి రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గుతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ నీటి వనరులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు.పురుషోత్తపట్నం ఎత్తిపోతల ద్వారా ఏలేరును నింపడం వల్లే ప్రస్తుతం విశాఖకు కీలకమైన నీటి సరఫరా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. పోలవరం పూర్తయ్యే వరకు వేచి చూడకుండా అప్పట్లో పురుషోత్తపట్నం లిఫ్ట్‌ను ఏర్పాటు చేయడం చంద్రబాబు ముందుచూపుకు నిదర్శనమన్నారు. గతంలో పట్టిసీమ, పురుషోత్తపట్నం ప్రాజెక్టులను విమర్శించిన వారు, నేడు వాటి ప్రయోజనాలను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరు అందించడంతో శ్రీశైలం నీటిని రాయలసీమ, నాగార్జునసాగర్ తాగునీటి అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. అదేవిధంగా పురుషోత్తపట్నం ద్వారా ఏలేరును నింపడం వల్ల సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా విశాఖ తాగునీటికి భరోసా ఏర్పడిందన్నారు.

### పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రకు గోదావరి జలాలు

2027లో పోలవరం పూర్తయిన వెంటనే పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా 17,500 క్యూసెక్కుల సామర్థ్యంతో ఉత్తరాంధ్రకు గోదావరి జలాలను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి గోదావరి వరద జలాలను ఉత్తరాంధ్రకు అందించాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. పోలవరం పూర్తయి ఉంటే ఇప్పటికే ఉత్తరాంధ్రకు గోదావరి జలాల ప్రయోజనం మరింత ముందుగానే అందేదని మంత్రి అన్నారు. పోలవరం విషయంలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన జాప్యం వల్ల ఉత్తరాంధ్రకు నీటి ప్రయోజనాలు ఆలస్యమయ్యాయని మంత్రి పేర్కొన్నారు.

### డేటా సెంటర్లపై తప్పుడు ప్రచారం వద్దు

రాబోయే డేటా సెంటర్లకు అవసరమైన నీటి పరిమాణంపై కూడా తప్పుడు ప్రచారం జరుగుతోందని మంత్రి అన్నారు. విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలను సమతుల్యం చేస్తూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా నీటి వనరులను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

### ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై దీర్ఘకాలిక దృష్టి

భవిష్యత్తులో విశాఖ తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు శాశ్వత పరిష్కారం కోసం ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటి ప్రాజెక్టులపై కూడా ప్రభుత్వం దృష్టి పెడుతోందని మంత్రి తెలిపారు. గ్రావిటీ ద్వారా విశాఖకు నీటిని అందించే అవకాశాలను కూడా పరిశీలిస్తూ దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించాలని సీఎం ఆదేశించారని చెప్పారు.

### సెప్టెంబర్ 23న మరోసారి సమీక్ష

సూపర్ ఎల్‌నినో నేపథ్యంలో ఈ ఏడాది అత్యవసర పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి విశాఖకు తాగునీటి ఇబ్బంది లేకుండా చూడడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. సెప్టెంబర్ 23న విశాఖ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇరిగేషన్, పురపాలక శాఖ అధికారులతో మరోసారి సమావేశమై విశాఖకు శాశ్వత తాగునీటి పరిష్కారంపై చర్చించనున్నట్లు తెలిపారు. విశాఖ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు శాశ్వత నీటి భద్రత కల్పించేందుకు కూటమి ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.

# స్వచ్ఛ్ ఆంధ్ర -స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జైత వరంలో రెండు చెరువుల క్లీనింగ్





**అనకాపల్లి / చీడికాడ , సెప్టెంబర్ 19 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా చీడికాడ మండలంలోని జైతవరశీ గ్రామంలో స్వచ్ఛ్ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ ఆఫీసర్ మరియు ఎంపీడీవో , ఎంపీటీసీ పర్యవేక్షణలో శనివారం ఉదయం ఏడు గంటలకు జైతవరం గ్రామంలో రెడ్డివారి చెరువు మరియు గ్రామంలో గల కోనం లో చుట్టూ తుప్పుల పేరుకుపోయి ఉంటే వాటిని తొలగించారు. మరియు ప్లాస్టిక్ వస్తువులను కూడా వేరు చేశారు. రెండు చెరువుల్లో మండలంలో గల పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ఎనర్జిస్ సిబ్బంది కలిపి ఉదయం 7:00 నుంచి 11 గంటల వరకు అందరూ కలిసికట్టుగా పనిచేసి రెండు చెరువులను పరిశుభ్రంగా ఆహ్లాదకరంగా మంచి వాతావరణం తీసుకొచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పైలా ముత్యాల నాయుడు పంచాయతీ కార్యదర్శి చండా వెంకటేశ్వరరావు, కోనం ఛానల్ టు కాల్ ఓ ప్రెసిడెంట్ రెడ్డి కాశీ విశ్వనాథ్, వెలుగు ఏపిఎం కనకమ్మ ఏపీవో నాయుడు పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది క్లాప్ మిత్రలు గ్రామంలో పెద్దలు మహిళలు ప్రజలు పాల్గొన్నారు.